# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 01 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 3


## అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీం తీర్పు రిజర్వ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపుపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపునకు పునర్విభజన ప్రక్రియను ప్రారంభించే విధంగా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకూ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఈ పిటిషన్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ని అమలు చేయడానికి ప్రతివాదులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాలను మాత్రమే డీలిమిట్ చేయడం అసమంజస మైనదనీ, ఇది రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు 2022లో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిస్పందనలను కోరింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు జమ్మూకాశ్మీర్‌తో సమానత్వాన్ని కోరుతున్నారని వాదించారు.

# కులగణనకే కేంద్రం ఓకే

- **జనాభా లెక్కింపులో కులగణన**
- **కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో కులగణనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జన గణనలో కుల గణన అంశాన్ని చేర్చాలని కేంద్ర కేబినేట్ నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భేటీ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన విషయంలో కాంగ్రెస్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనను ఆ పార్టీ రాజకీయంగా వాడుకున్నట్లు విమర్శలు చేశారు.

బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీపీఏ) సమావేశమైంది. వచ్చే జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు కులగణన చేపట్టాయని అన్నారు. వాటిలో కొన్ని రాష్ట్రాలు రాజకీయ సాధనంగా కులగణనను వాడుకున్నాయని ఆయన ఆరోపించారు. కులగణన నిర్ణయం తమ ప్రభుత్వం సమాజం, దేశ విలువలు, ప్రయోజనాలకు కట్టుబడి ఉందని నిరూపిస్తుందన్నారు. గతంలో తమ ప్రభుత్వం సమాజంలోని ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిందని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎల్లప్పుడూ కులగణనను వ్యతిరేకించాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నిర్వహించిన అన్ని జనాభా గణన కార్యకలాపాలలో కులాన్ని చేర్చలేదు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభకు కులగణన అంశాన్ని క్యాబినెట్‌లో పరిగణిస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి మంత్రుల బృందం ఏర్పడింది. చాలా రాజకీయ పార్టీలు కులగణనను సిఫారసు చేశాయి. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనకు బదులుగా కుల సర్వేను మాత్రమే నిర్వహించాలని నిర్ణయించింది. ఆ సర్వేను ఎస్ఈసీసీ అంటారు" అని వైష్ణవ్ అన్నారు. "కాంగ్రెస్, ఇండియా బ్లాక్ భాగస్వాములు కులగణనను రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించు కున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం జనాభా గణన అంశం ఏడో షెడ్యూల్‌లోని కేంద్ర జాబితాలో 69లో జాబితా చేయబడింది. భారత రాజ్యాంగం ప్రకారం, జనాభా గణన అనేది కేంద్ర జాబితా అంశం. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించడానికి సర్వేలు నిర్వహించాయి. కొన్ని రాష్ట్రాలు దీన్ని బాగా చేశాయి, మరికొన్ని రాష్ట్రాలు పారదర్శకంగా లేని విధంగా రాజకీయ కోణం నుంచి మాత్రమే ఇటువంటి సర్వేలను నిర్వహించాయి. ఇటువంటి సర్వేలు సమాజంలో సందేహాలను సృష్టించాయి. మన సామాజిక నిర్మాణం రాజకీయాలతో చెదిరిపోకుండా చూసుకోవడానికి, సర్వేలకు బదులుగా కులగణన ను జనాభా గణనలో చేర్చాలి. ఇటువంటి సర్వేలు సమాజంలో సందేహాలను సృష్టించాయి. ఈ వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సామాజిక నిర్మాణం రాజకీయాలతో చెదిరిపో కుండా చూసుకోవడానికి, సర్వేలకు బదులుగా కుల గణనను జనాభా గణనలో పారదర్శకంగా చేయాలి. ఇది సమాజం సామాజిక, ఆర్థిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుంది. దేశం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" అని ఆయన అన్నారు.

చెరకు మద్దతు ధర క్వ్యాటీఎల్‌కు రూ.355గా ప్రకటించారు. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశం జరిగింది. 2025-26 చక్కెర సీజన్ (అక్టోబర్-సెప్టెంబర్)లో చెరకుకు న్యాయమైన, లాభదాయక ధర (ఎఫ్ఆర్పీ)ను 10.25 శాతం ప్రాథమిక రికవరీ రేటుకు క్వ్యాటిఎల్‌కు రూ.355గా ఆమోదించింది. 10.25 శాతం కంటే ఎక్కువ రికవరీలో ప్రతి 0.1 శాతం పెరుగుదల క్వ్యాటీఎల్‌కు రూ.3.46 ప్రీమియంను అందిస్తుంది. రికవరీలో ప్రతి 0.1 శాతం తగ్గుదలకు క్వ్యాటీఎల్‌కు రూ.3.46ని తగ్గిస్తుంది. అయితే, చెరకు రైతుల వడ్డీని కాపాడే ఉద్దేశంతో ప్రభుత్వం 9.5 శాతం కంటే తక్కువ రికవరీ ఉన్న చక్కెర మిల్లుల విషయంలో ఎటువంటి తగ్గింపు ఉండకూడదని కూడా నిర్ణయించింది. అటువంటి రైతులు తదుపరి చక్కెర సీజన్ 2025-26లో చెరకుకు క్వ్యాటిఎల్‌కు రూ.329.05ను పొందుతారు. దాదాపు 5 కోట్ల మంది చెరకు రైతులు, వారిపై ఆధారపడినవారు చక్కెర కర్మాగారాల్లో ప్రత్యక్షంగా పనిచేసే 5 లక్షల మంది కార్మికుల జీవనోపాధిని ప్రభావితం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది.

అలాగే మేఘాలయ, అసోంలను కలుపుతూ రూ.22,864 కోట్ల వ్యయంతో 166.8 కిలోమీటర్ల పొడవైన షిల్లాంగ్-సిల్చార్ నాలుగు లేన్ల కారిడార్ హైవేను కూడా క్యాబినెట్ ఆమోదించిందని అశ్విని వైష్ణవ్ అన్నారు. "ఈ హైవే మణిపూర్, మిజోరం ప్రజలకు కనెక్టివిటీని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ హైబ్రిడ్ మోడ్ కింద పరిగణించబడుతుంది" అని ఆయన తెలిపారు.

# తెలంగాణ ఇచ్చినందుకా కాంగ్రెస్ విలన్.?

- **వరంగల్ సభలో నాపేరు కూడా పలకలేకపోయారు**
- **అసెంబ్లీకి రాకుండా జీత భత్యాలు తీసుకుంటున్న ప్రతిపక్షనాయకుడు**
- **ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల బహిరంగసభలో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పదేండ్లు దోచుకున్న మీకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదని,తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనైందా అని ప్రశ్నించారు. బుధవారం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సామాజిక సంస్కర్త మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ 12 వ శతాబ్దిలోనే సమాజంలో అసమానతలు అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయమన్నారు బసవేశ్వరుడు వ్యక్తికి, సమాజానికి ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన స్ఫూర్తితో పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. ప్రతి వ్యక్తి గౌరవం గా జీవించే ప్రణాళికలు ప్రభుత్వాలు రూపొందించాలని సూచించారు. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

అధికారంలో ఉన్న వారి నిర్ణయాలలో ఉన్న లోపాలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రతిపక్షం ప్రయత్నించాలి కానీ నేడు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం అలాంటి పాత్ర పోషించడం లేదని విమర్శించారు. ఇటీవల వరంగల్‌లో ఒకాయన సభ పెట్టి కాంగ్రెస్‌పై ద్వేషం వెల్లగక్కిండన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆర్టీసీ నుంచి బస్సులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందన్నారు. తాము చేసిన మంచిని సభలో అభినందించి ప్రజా సమస్యలను అక్కడ ప్రస్తావించి ఉంటే ప్రజలు మెచ్చుకునేవారని చెప్పారు. ప్రతి పక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాకుండా జీత భత్యాలు, వసతులు ఉపయోగించుకుంటున్న ఆయనకు నైతికత ఉందా అని ప్రశ్నించారు. పతిపక్ష నాయకుడిగా రూ. 65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారని తెలిపారు. ఫామ్ హౌస్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారని నిలదీశారు. అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? అని అన్నారు.

సంక్షేమ పథకాలు ఆగిపోయాయంటున్నాడని.. మరి రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయిందని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మరి మీరు ఏ మత్తులో తూగుతున్నారో మీకే తెలియాలన్నారు. కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేష పూరితప్రసంగం చేశారని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చిద్దాం రండి అని సవాల్ విసిరారు. ప్రజలు విజ్ఞులని.. ఎవరేం చేశారో ప్రజలకు తెలుసన్నారు. పదేండ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు కేసీఆర్ వరంగల్ వెళ్లాడని.. వరంగల్ సభలో తన పేరు కూడా పలకలేకపోయారన్నారు. తెలంగాణ అగం కాలేదనీ అయన కుటుంబం ఆగమైందన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో రాష్ట్ర ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే విధానంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్ షెట్కర్, షబ్బీర్ అలీ, వి. హనుమంత రావు పాల్గొన్నారు.

# చందనోత్సవంలో అపశృతి

- **సింహాచలంలో గోడ కూలి 8 మంది మృతి**
- **త్రిసభ్య కమిటీ విచారణ**
- **దుర్ఘటనలపై ప్రధానిమోడీ, ఏపీ, తెలంగాణ సిఎంలు చంద్రబాబు,**
- **రేవంత్ దిగ్భ్రాంతి, ప్రతిపక్ష నేత జగన్ దిగ్భ్రాంతి**
- **మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు**
  **: ఏపీ సీఎం చంద్రబాబు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఏపీలోని సింహాద్రి అప్పన్న ఆలయంలో మాటలకందని విషాదం చోటు చేసుకుంది. అప్పన్న సన్నిధిలో చందనో త్సవ సమయంలో బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. రూ.300 టికెట్ క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులపై గోడ కూలడం తో ఏ డుగురు భక్తులు దుర్మరణం చెందా రు. మరో నలుగురు భ క్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలిం చారు. ఇక మృతి చెందిన వారి మృతదేహాల ను విశాఖ జిజిహెచ్‌కు తరలించారు. మంగళవారం కురిసిన భారీ వ ర్షానికి గోడ కూలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తు న్నారు. సింహగిరి బస్టాండ్ నుం చి పైకి వెళ్లే మార్గంలో ఉన్న కొత్త షాపింగ్ కాం ప్లెక్స్ దగ్గర గోడ కూలింది. గోడ నాసిరకంగా ఉండటం వల్లే కూలిపోయిందని అధికారులు భావిస్తున్నారు.

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధారించారు. మృతులు ఉమామహేశ్వరరావు హెచ్.సి.ఎల్. లోనూ, శైలజ ఇన్ఫోసిస్ లో సాఫ్ట్ వేర్ ఇంజి నీర్లుగా పనిచేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం వీరికి వివాహమైంది. ప్రస్తుతం వీరికి వర్క్ ఫ్రమ్ హెూమ్ కావడంతో ఇంటికి వచ్చారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందిన వారు. ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ప్రధాని క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు అందిస్తామన్నారు.

ఈ సంఘటనపై ఎపి సిఎం చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా గోడ కూలిన ఈ ఘటనలో మరణించిన వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడానని, గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించినట్లు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఈ విషాద ఘటనపై చంద్రబాబు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీతో విచారణకు ఆదేశించారు. చనిపోయినవారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం, గాయపడిన వారికి రూ.3 లక్షల పరిహారం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖల పరిధిలోని ఆలయాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం ఇవ్వాలని తీసుకున్నారు. గోడ కూలి భక్తులు మరణించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భక్తుల మృతి తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింహాచలంలో జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించాలని వైసిపి అధినేత వైఎస్ జగన్ డిమాం డ్ చేశారు. చందనోత్సవానికి ఆరు రోజుల ముందు గోడ కట్టారన్న జగన్ హడావిడిగా నిర్మించారన్నారు. కనీసం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని ముందుగా అంచనా వేసినా తగినముందస్తు చర్యలు తీసుకోలేదని జగన్ ఫైర్ అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎన్ని ప్రమాదాలు జరిగాయో అందరూ చూస్తున్నారు కదా? అని జగన్ ప్రశ్నించారు. సింహాచలం ప్రమాదంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. విచారణ కమిటీ పేరుతో చంద్రబాబు మ..మ అనిపించడం తప్ప అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేది లేదని తెలిపారు.

# పది ఫలితాలలలో మహబూబాబాద్ జిల్లా టాప్




- **అట్టడుగున వికారాబాద్**
- **92.78 శాతం ఉత్తీర్ణత**
- **బాలికలదే పైచేయి బాలుర కంటే 2.94 శాతం అధికం**
- **4,629 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత**
- **రెండు బడుల్లో సున్నా ఫలితాలు**
- **జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**
- **పదో తరగతి ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. బుధవారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పదో తరగతి పరీక్షల ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. దేశంలో సమూలమైన మార్పు రావాలంటే ప్రతి వారికీ నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు ముఖ్యంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రైవేటు సంస్థలకన్నా మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల సిబ్బందిని, అధ్యాపకులను, విద్యార్థులను ముఖ్యమంత్రి గారు మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రైవేటుకన్నా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించడం ప్రజా ప్రభుత్వం పనితీరుకు గీటురాయి అని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని బలంగా విశ్వసిస్తున్నామని, బసవన్న స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు సుమారు 5,09,403 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల్లో 98.2 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఏకంగా 98.7% ఉత్తీర్ణత నమోదైంది. గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఫలితాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ %https://bse.telangana.gov.in%/ లో చూసుకోవచ్చు. గతంలో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సీజీపీఏలు మాత్రమే ఇచ్చే విధానానికి బదులుగా.. ఈసారి రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడిగా చూపిస్తూ.. మొత్తం మార్కులు, గ్రేడ్లను మెమోలో చేర్చారు. కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదు చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 98.2 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెసిడెన్షియల్ స్కూళ్లలో 98.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సారి అనూహ్యంగా ప్రైవేటు స్కూళ్ల కంటే ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో అత్యధిక ఉత్తీర్ణ శాతం నమోదు కావడం విశేషం. బాలురు 91.32 శాతం, బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణులయ్యారు. 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. 99.29 శాతంతో మహబూబాబాద్ జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. 73.97 శాతంతో చివరి స్థానంలో వికారాబాద్ జిల్లా ఉంది. ?? ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, షబ్బీర్ అలీ గారు, హర్కర వేణుగోపాల్ రావు గారితో పాటు విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భూదాన్ భూముల కేసులో ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురైంది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలంటూ ఐపీఎస్ అధికారులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈరోజు (బుధవారం)వీరి పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్పీల్‌కు ఎందుకు వచ్చారని ఐపీఎస్ అధికారులను ప్రశ్నించింది. అలాగే సింగ్ బెంచ్ తీర్పుపై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. మళ్ళీ సింగిల్ బెంచ్‌కు వెళ్లాలని ఐపీఎస్‌లకు డివిజన్ బెంచ్ సూచించింది. ఈకేసుకు సంబంధించి సింగిల్ బెంచ్ తుది నిర్ణయం తీసుకోవాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఆపై ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ముగించింది.

కాగా.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోనిసర్వే నెంబర్ 194లో ఐపీఎస్‌లు భూములు కొన్నారు. సర్వే నెంబర్‌లో 194 లో 16,20,18 గుంటలుగా భూములను ఐపీఎస్ అధికారులు కొనుగోలు చేశారు. అయితే సర్వే నెంబర్ 181, 182,194,195 భూముల నిషేధిత జాబితాలో ఉంచాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఐపీఎస్‌లు హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేయాలని..హైకోర్టులో ఐఏఎస్ ఐపీఎస్‌ల అప్పీళు చేశారు. తాము కొన్న భూములు భూదాన్‌వి కాదని,పట్టా భూమూలేనంటూ ఐఏఎస్, ఐపీఎస్‌ల పిటిషన్‌లు వేశారు.

## హైదరాబాద్‌లో పలు పోలీస్ స్టేషన్ల పేర్లు మార్పు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మహానగరంలోని ప్రఖ్యాత ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని పోలీస్ స్టేషన్లు, డివిజన్ల పేర్లను మార్చుతున్నట్లు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. 72వ లా అండ్ ఆర్డర్ పీఎస్‌గా టోలిచౌకి ఏర్పాటు చేసినట్లు, సెక్రటేరియట్ పీఎస్‌ను లేక్ పోలీస్ స్టేషన్‌గా, హుమాయున్ నగర్‌పీఎస్‌ను మెహదీపట్నం పీఎస్‌గా, షాహినాయత్‌గంజ్ పీఎస్‌ను గోషామహల్ పీఎస్‌గా మార్చినట్లు ఆయన వివరాలను వెల్లడించారు.

35 ఏళ్ల తర్వాత హైదరాబాద్? కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ జరిగింది. నగరంలో 71 లా అండ్ ఆర్డర్, 31 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్ల హద్దుల్లో సమస్యలు ఎదురవుతూ వచ్చాయి. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌పై గందరగోళం సైతం నెలకొంది. ప్రభుత్వానికి నివేదిక పంపితే మార్పులకు ఆమోదం తెలిపింది. పోలీస్‌స్టేషన్ల వివరాలను హైదరాబాద్? సిటీ పోలీస్? వెబ్?సైట్?లో పొందుపరుస్తామని సీపీ సీవీ ఆనంద్? తెలిపారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ ప్రక్షాళన చేపట్టగా పెద్ద ఎత్తున సీఐలను బదిలీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 146 మంది సీఐలను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులను జారీ చేశారు.

## టీజీపీఎస్సీకి షాక్

- **టీజీపీఎస్సీ చేసిన అప్పీల్‌పై విచారించేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరణ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రూప్-1 నియామకాల ప్రక్రియ పూర్తి చేయరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును రద్దు చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ చేసిన అప్పీల్‌పై విచారించేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారం సింగిల్ జడ్జి వద్ద ఉందని, ఆయన వద్దనే తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు తాతాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక యారాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మధ్యంతర ఉత్తర్వులపై ఏ నిర్ణయమైనా సింగిల్ జడ్జే తీసుకోవాలని స్పష్టంచేసింది. ఈ వివాదాన్ని హైకోర్టుకు వేసవి సెలవుల్లోగానే పరిష్కరించాలని సింగిల్‌జడ్జికి సూచించింది. తొలుత టీజీపీఎస్సీ తరపు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. గ్రూప్-1 పోస్టుల నియామకాలన్నీ నిలిచిపోయాయని, ఇతర ప్రక్రియ అంతా పూర్తిచేశామని చెప్పారు. తమ వాదనలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోకుండానే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. సింగిల్ జడ్జి వద్ద మధ్యాహ్నం విచారణ జరగనుందని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, మరి ఇంతలోనే తమ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది.

# కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు-2025 త్వరలో తీసుకొస్తున్నాం : సీఎం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తుందనీ, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని అన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములనీ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహద పడుతుందని తెలిపారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. మే డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు-2025 త్వరలో తీసుకొస్తున్నట్టు చెప్పారు.

ఉత్పత్తి, సేవా రంగాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం, ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలను అందుకుంటూ విజయవంతంగా అమలవుతుందని తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేసినట్టు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించామన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల చొప్పున బోనస్ ఇవ్వడంతో పాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు రూ.కోటిబీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని వెల్లడించారు. చేనేత కార్మిక కుటుంబాలను ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు రుణమాఫీ అమలు చేశామని పేర్కొన్నారు.

# అందాల పోటీలతో స్త్రీ జాతిని అవమానిస్తున్నారు

- సీపీఐ నేత నారాయణ

**బలగం టీవి, హైదరాబాద్**




తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించనుండటంపై సీపీఐ నేత నారాయణ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుపతి జిల్లా గూడూరులో తన మేనకోడలికి చెందిన ఓ వాణిజ్య సంస్థ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అందాల పోటీలు నిర్వహించడం ద్వారా పవిత్రమైన స్త్రీ జాతిని అవమానిస్తున్నారని నారాయణ ఆరోపించారు. తన మేనకోడలు పావని అందాల పోటీలో పాల్గొంటే ఫస్ట్ వస్తుందని ఛలోక్తులు విసిరారు. కానీ అలా చేయడం తప్పని.. పవిత్రమైన స్త్రీ జన్మను అపవిత్రం చేయొద్దని కోరారు. “అందాల పోటీ అంటే స్త్రీలను నడిరోడ్డు మీద వేలం వేయడం కాదా? ఇది సరైన పద్ధతి కాదు. ఇలాంటి పోటీలు నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి లేదు” అని ఆయన తీవ్రంగా విమర్శించారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.25 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ పోటీలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తన మేనకోడలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి పది మందికి సేవ చేయాలన్న సంకల్పంతో స్వయం ఉపాధిని ఎంచుకుందని గుర్తుచేశారు. పది మందికి జీవనాధారం కల్పించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. స్వయం శక్తితో బతికేందుకు స్త్రీలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరారు.



## బాసర సరస్వతి అమ్మవారికి బంగారు గొలుసు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి బుధవారం అక్షయ తృతీయను పురస్కరించుకొని నిజామాబాద్ పట్టణం గంగాస్థన్ కు చెందిన జి సుఖేందర్ రెడ్డి సుమారు మూడు లక్షల ఎనభై వేల రూపాయల విలువగల మూడున్నర తులాల బంగారు గొలుసును ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి కి అందజేశారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి గొలుసును వాడాలని భక్తుడు సూచించాడు. అనంతరం అమ్మవారికి బంగారు గొలుసు ప్రధానం చేసిన జి.సుఖేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఆలయ ఇన్ స్పెక్టర్ నరేశ్, సిబ్బంది ఉన్నారు.



## అమెరికాలో భార్య, కుమారుడిని తుపాకీతో కాల్చి చంపి ఆత్మహత్య చేసుకున్న భారతీయుడు

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికాలో భారత్‌కు చెందిన ఓ టెక్ తన భార్య, కుమారుడిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్నాటకలోని మాండ్యా జిల్లాకు చెందిన హర్షవర్ధన్(57), శ్వేత పన్యం(44) తన ఇద్దరు కుమారులతో కలిసి వాషింగ్టన్ ప్రాంతం న్యూక్యాజిల్‌లో ఉంటున్నాడు. హర్షవర్ధన్ తన భార్య శ్వేత, ఒక కుమారుడిని తుపాకీతో కాల్చి చంపి అనంతరం తాను కాల్చుకున్నాడు. మరో కుమారుడు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. హర్షవర్ధన్ ఇలా చేయడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని చెబుతున్నారు ఏప్రిల్ 24న ఈ ఘటన చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని పోలీసులు వెల్లడించారు.

2017లో భార్య శ్వేతతో కలిసి భారత్‌కు తిరగొచ్చాడు. మైసూర్ లో హెూలోవరల్డ్ అనే రోబోటిక్ కంపెనీని ప్రారంభించారు. ఈ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలి శ్వేత ఉంటున్నారు. కంపెనీకి మంచి పేరు రావడంతో సరిహద్దులో భద్రత కోసం రోబోలను తయారు చేసేందుకు ప్రధాని నరేంద్రమోడీని హర్షవర్ధన్ కలిశారు. కరోనా సమయంలో నష్టాలు రావడంతో కంపెనీని మూసేసి మళ్లీ అమెరికాకు వెళ్లిపోయారు. గతంలో హర్షవర్ధన్ మైక్రోసాఫ్ట్‌లో పని చేసినట్టు సమాచారం. రోబోటిక్ నిపుణుడిగా హర్షవర్ధన్‌కు మంచి పేరు ఉంది. కాగా, ప్రస్తుతం హర్షవర్ధన్ కుటుంబం ఆత్మహత్య ఘటనతో ఆయన సొంత గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

## ముగిసిన ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. మంగళవారం, బుధవారం అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం ప్రవేశ పరీక్షలు జరిగాయి. బుధవారం 94 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. గురువారం పరీక్షలకు విరామం ప్రకటించారు. ఇక శుక్రవారం నుంచి ఇంజినీరింగ్ విభాగానికి ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. రోజుకు రెండు సెషన్ల చొప్పున శుక్ర, శని, ఆదివారాల్లో మొత్తం ఆరు సెషన్లలో ఇంజినీరింగ్ విభాగానికి జేఎన్టీయూ ప్రవేశ పరీక్షలు నిర్వహించనుంది. ఇంజినీరింగ్‌కు 2.20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

# మహబూబ్ నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**బలగం టీవి, హైదరాబాద్**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలంలోని కందూరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి కందూర్ స్టేజీ వద్ద పెద్దవాగుపై ఉన్న వంతెనపై లారీ పక్కనే మరోవైపు స్కూటీ వెళుంది. ఆ సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన డీసీఎం అధిగమించేందుకు దారి లేక సడన్ బ్రేక్ వేసినట్లు తెలిపారు. వెనుక నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి డీసీఎంను ఢీ కొట్టుకుంది. ఆ కారును అదే వైపున చూస్తున్న లారీ వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో డీసీఎం లారీ మధ్యలో కారు మొత్తం నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ఉన్న ఓ మహిళ శోభారాణి (50) మృతి చెందగా, ఆమె భర్త ఎల్లారెడ్డికి, శోభారాణి తల్లి విమలకు, డ్రైవర్ గాయలైనట్లు తెలిపారు. ముందు ఉన్న డీసీఎం వెళ్లి స్కూటీని ఢీ కొట్టింది. స్కూటీపై ఉన్న రఘుపతి రెడ్డి కూడా గాయాలయ్యాయి. వంతెనపై ప్రమాదం జరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు పోలీసుల సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు,



మూసాపేట ఎస్సై వేణు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఎల్ అండ్ టి సిబ్బంది, స్థానికులతో పాటు కలిసి అతి కష్టం మీద క్షతగాత్రులను కారులో నుంచి బయటికి తీశారు.గాయలైన వారిని అంబులెన్స్ లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కారులో వెళ్తున్న వారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన వారు హైదరాబాద్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఇంత క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సింహాచలం ఘటన దురదృష్టకరం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**



ఏపీలోని సింహాచలం అప్పన్నస్వామి ఆలయం వద్ద తెల్లవారు జామున జరిగిన ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించించారు. ఈ విషాదకర వార్త తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నానన్నారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు అత్యంత బాధాకరమని, బాధితులందరికీ తన ప్రగాఢ సానుభూతి ఉంటుందన్నారు.

## టీజీపీఎస్సీ చైర్మెన్‌కు బండి సంజయ్ లేఖ

**బలగం టీవి, హైదరాబాద్**



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై నెలకొన్న వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ పరీక్షల నిర్వహణ తీరుపై సమగ్ర సమాచారాన్ని వారం రోజుల్లోగా అందించాలని కోరుతూ ఆయన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. గ్రూప్-1 పరీక్షల ప్రక్రియలో అవకతవకలు, లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ అభ్యర్థులు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రూప్-1 పరీక్షల విషయంలో తమకు అనేక సందేహాలున్నాయని, అవినీతి, అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు అభ్యర్థులు ఇటీవల బండి సంజయ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు లేవనెత్తిన ప్రధాన సందేహాలను, ఆరోపణలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లోగా అందజేయాలని టీజీపీఎస్సీ చైర్మన్‌ను కోరారు.



## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

### రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్

**బలగం టీవీ, సిరిసిల్ల**

పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. పదో తరగతి ఫలితాలు బుధవారం వెలువడగా, జిల్లాకు చెందిన వివిధ విద్యాలయాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, వారిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించి, సన్మానించారు అలాగే జిల్లా నుంచి పీ వర్షిణి 591/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలువగా, కలెక్టర్ అభినందించి సన్మానించారు.కార్యక్రమంలో ఆయా విద్యాలయాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ విద్యార్థుల ప్రభంజనం..

**బలగం టీవీ, సిరిసిల్ల**

పదో తరగతి ఫలితాల్లో సిరిసిల్ల పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 100% ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేశారు. కీసరి ఒజశ్విని 576/600, జిందం సుచిత 566, ఆసిరెడ్డి రితీష్ 560, ఐలేని షణ్ముఖ ప్రియ, 553మరియు పాసైన విద్యార్థులు యాజమాన్యం అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఏజీఎం చైతన్య రావు ఆకాంక్షించారు . ప్రిన్సిపాల్ జిమోల్, అకాడమిక్ డీన్ మహేష్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను పాల్గొన్నారు

# ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎన్ని సర్వే చేశారు



**-లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలి**
**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని సర్వే చేశారు, ఎన్ని దరఖాస్తులు ఆన్లైన్ చేశారు అని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం ఇందిరమ్మ ఇండ్ల పథకంపై జిల్లాలోని ఆయా మండలాలు, మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలు, మండలాల వారిగా లక్ష్యం మేరకు ఎంత పూర్తి చేశారో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అర్హులైన పేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందనిఅన్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, అర్హులకే అందేలా చూడాలని అన్నారు.జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, మండలాల్లో మొత్తం 7690 దరఖాస్తులు అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, వీటిలో ఇప్పటిదాకా 5776 వారి వివరాలు ఆన్లైన్ చేశారనిఅన్నారు. మిగతా వివరాలు పరిశీలిస్తున్నారని,అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అన్నారు. వచ్చే నెల 2వ తేదీన ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వార్డుల్లో దరఖాస్తుదారు జాబితా ప్రదర్శిస్తారని, 5వ తేదీన తుది జాబితా ప్రదర్శిస్తారని,అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలనిఅన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బసవ జయంతి వేడుకలు..

**-నివాళులు అర్పించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం బసవ జయంతి వేడుకలను నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, కుల సంఘం ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలి

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు మిగతా వారికి స్ఫూర్తిదాయకం అని,శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.బుధవారం పోలీస్ శాఖలో 42 సంవత్సరాలగా కానిస్టేబుల్ నుండి ఏ ఎస్ఐ గా పదోన్నతి పొంది, ప్రస్తుతం చందుర్తి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తు ఏ ఎస్ ఐ మీర్జా యాహియా బేగ్ పదవి విరమణ పొందుతున్న సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితే వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని,వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరనిఅన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి సూచించారు . పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని,తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని,ఎటువంటి అవసరం ఉన్న పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అంజయ్య,%ఖుంఆ% ఏ ఎస్సై మీర్జా యాహియా బేగ్ కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## మే డేను విజయవంతం చేయాలి

**సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే కరపత్రం విడుదల**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ హమాలీల ఆధ్వర్యంలో మే డే కరపత్రం బుధవారం రోజున ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మండల సిఐటియు కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ: మే ఒకటో తేదీన జరుపుకునే మే డే దినోత్సవం మండల కేంద్రంలో కష్టజీవుల ఎర్రజెండాను ఎగరవేయడం జరుగుతుందని, మండలంలో ఉన్న గ్రామాల అన్ని రంగాల కార్మికులు హమాలీ, భవన నిర్మాణ కార్మికులు, మహిళా బీడీ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, సన్నకారు, చిన్నకారు రైతులు, ఉపాధి హామీ కూలీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర రంగాల కష్టజీవులు అందరూ ఈ కార్యక్రమానికి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడగొండ హమాలి కార్మికులు సంబు వీలందర్, ఇస్తారి, మేకల శీను, మేకల మహేందర్, పెద్దిగారి అశోక్, ఎండి రహీం, రాగుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి నూతన చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం




**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

భూ భారతి నూతన చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు. బుధవారం భూ భారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో,అలాగే వీర్నపల్లిలో నిర్వహించిన సదస్సులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు – భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందనిఅన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, భూముల మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తామని,పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారనిఅన్నారు. పాసు పుస్తకాలలో భూమి పటం ఉంటుందని అన్నారు. భూ సమస్యల పరిస్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని అన్నారు.ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని వివరించారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుందని కలెక్టర్ అన్నారు.భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూ భారత చట్టాన్ని తీసుకువచ్చిందని,రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారనిఅన్నారు.

ఎల్లారెడ్డిపేటలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబెరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్లు సుజాత, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. వీర్నపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, ఇంచార్జి తహశీల్దార్ ముక్తార్ పాషా, ఇంచార్జి ఎంపిడీవో అబ్దుల్ వాజీద్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో బంద్ ప్రశాంతం...

**-పాకిస్తాన్ చిత్రపటం దహనం రోడ్డు పై వేసి తొక్కిన యువకులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గం లో హిందువులపైన ఉగ్రవాదముకలు చేసిన హత్య ఖండనకు మరణించిన వారికీ శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికీ నివాళి అర్పించి మతోన్మాద ఉగ్రవాదానికి నిరసనగా బుధవారం ఎల్లారెడ్డి పేట మండలం వర్తక వాణిజ్యాలు మరియు హోటల్ యజమానులు స్వచ్ఛందంగా బందు నిర్వహించారు.ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రపంచంలోని ఉగ్రవాదం అణిచివేతకు భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా భారత ప్రభుత్వానికి భారతీయులం అందరం మద్దతుగా ఉంటామని అన్నారు.

కాశ్మీర్ లోని పహల్గాం కి విహారయాత్రకు వెళ్లిన వారిని మతం పేరుతో విభజించి, ఒక వర్గం వారినే లక్ష్యంగా చేసుకుని హతమార్చిన



ఉగ్రవాదుల పిరికిపంద చర్యను ప్రపంచమంతా ఖండిస్తోందని అన్నారు.ఇప్పటికే చిప్ప చేత పట్టుకుని ప్రపంచమంతా తిరుగుతున్న పాకిస్తాన్ ఈ దుశ్చర్యకు పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు.



## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన

**-జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. పదో తరగతి ఫలితాలు బుధవారం వెలువడగా, జిల్లాకు చెందిన వివిధ విద్యాలయాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, వారిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించి, సన్మానించారు అలాగే జిల్లా నుంచి పీ వర్షిణి 591/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలువగా, కలెక్టర్ అభినందించి సన్మానించారు.కార్యక్రమంలో ఆయా విద్యాలయాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు